క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో ఆయనకు స్వాగతం పలికారు.

స్టీల్ ఇంటక్ అధ్యక్షుడికి పితృ వియోగం



నీరుకొండ సన్యాసి నాయుడు (ఫైల్)

కూర్మన్నపాలెం: స్టీల్ ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావుకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి కో–ఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నీరుకొండ సన్యాసినాయుడు(85) గురువారం మృతి చెందారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి, ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందిన సన్యాసినాయుడి మృతికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు. విశ్వేశ్వర నగర్ (శ్రీనగర్)లో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు నీరుకొండ రామచంద్రరావు తెలిపారు.

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేసి, 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు ఈ పూజ నిర్వహించారు.

● అప్పన్న స్వామికి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మంపడంలో వేయింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ అలంకారి పురోహిత్ కరి సీతారామాచార్యులు తదితరులు ఈ సేవ నిర్వహించారు.

బీజేపీ నాయకుల సంబరాలు



విజయోత్సాహంలో బీజేపీ నాయకులు

గాజువాక: ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్‌డీఏ విజయం సాధించడంతో బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నాగాలాండ్, త్రిపుర ఎన్నికల్లో ఎన్‌డీఏ విజయపతాక ఎగరవేయడంతో శ్రామికనగర్‌లోని ఆ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయంలో సంబరాలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలా కిశోర్, గాజువాక కో–ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్లు.. తళతళ

● మెరుస్తున్న రహదారులు
● హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



రామచంద్రనగర్‌లో..



నడుపూరులో ..



గాంధీనగర్‌లో కొత్తగా వేసిన రోడ్డు

రహదారులు తళతళ మెరిసిపోతున్నాయి. నియోజకవర్గ పరిధిలో రోడ్లు అద్దంలా కనిపిస్తున్నాయి. గతంలో వర్షాలకు ఛిద్రమై, రోడ్లపై రాళ్లు తేలడంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ నిధులతో రహదారులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, కొత్తగా రోడ్లు నిర్మించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - పెదగంట్యాడ

ప్రచార హోరు

గాజువాక: ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రచారం ఊపందుకుంది. వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని కోరుతూ ఎమ్మెల్యే నాగిరెడ్డి గురువారం ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులతో కలిసి కోర్టు బయట న్యాయవాదులను కలిసి, ఓటు అభ్యర్థించారు. సీతంరాజు గెలిస్తే ఉత్తరాంధ్రకు లభించే ప్రయోజనాన్ని వివరించారు. కార్యక్రమంలో యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి, 72వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు మంత్రి రాజశేఖర్, వెంపాడ అప్పారావు, లీగల్ సెల్ నాయకులు డేవిడ్‌రాజు, సోమేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు రమణబాబు, మురళీమోహన్, బొక్క ప్రభాకర్, కాంతారావు, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

79, 85 వార్డుల్లో..

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లో వైఎస్సార్సీపీ, టీడీపీలు ప్రచారం ముమ్మరం చేశాయి. లంకెలపాలెంలో వార్డు వైఎస్సార్సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు ఓటర్లను కలిసి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీలతో పాటు హైస్కూల్ వద్ద టీడీపీ మద్దతు అభ్యర్థి వేపాడ చిరంజీవిని గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. శనివాడ, పెదమడక, కొండయ్యవలసల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, చిరంజీవి ప్రచారంలో పాల్గొన్నారు.



అగనంపూడి, హైస్కూల్ గేటు వద్ద ప్రచారం చేస్తున్న చిరంజీవి

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: 87వ వార్డు పరిధిలోని కణితి ఆర్‌హెచ్ కాలనీలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు.



న్యాయవాదులకు కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

72వ వార్డులో..

గాజువాక: వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని కోరుతూ 72వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. అఫీషియల్ కాలనీలోని పట్టభద్ర ఓటర్లను కలుసుకొని ఓట్లు అభ్యర్థించారు.

● జీవీఎంసీ 66వ వార్డులో కార్పొరేటర్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు మహమ్మద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

హౌస్ కమిటీ సమస్య పరిష్కారంపై హర్షం

అక్కిరెడ్డిపాలెం: మూడు దశాబ్దాలుగా హౌస్ కమిటీ సమస్యతో ఇబ్బంది పడుతున్న గాజువాక ప్రజలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వరం ఇచ్చారని 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు అన్నారు. జీవో నంబర్ 71 విడుదలపై హర్షం వ్యక్తం చేస్తూ వార్డు పరిధిలోని చిట్టినాయుడు కాలనీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోతో హౌస్ కమిటీ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. సర్వే నంబర్లు 86, 87, 274 లలో భూ వివాదానికి తెర పడిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గాట్ కృష్ణ, అచ్చిబాబు, అప్పలరాజు, అప్పలనాయుడు, రంగాల పైడిరాజు, రాములమ్మ, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ చందు

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జీవీఎంసీ స్కూల్ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: ప్రకృతి ధర్మమైన గొలుసు కట్టు విధానంలో మనిషి, భూగోళం మనుగడకు వన్యప్రాణుల సంరక్షణ అత్యంత అవసరమని గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపకుడు జేవీ రత్నం అన్నారు. మార్చి 3న 50వ వన్యప్రాణి దినోత్సవ నినాదాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సంస్థ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని సెవెంత్ డే ఎడ్వెంటిస్ట్ స్కూల్, ఏఎస్ రాజా మహిళల జూనియర్ కళాశాల, శివాజీపాలెం జీవీఎంసీ ప్రైమరీ పాఠశాలల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జేవీ రత్నం మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన 'వన్యప్రాణుల సంరక్షణ కోసం భాగస్వాములు కండి' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఏయూ సోషల్ వర్క్ విద్యార్థిని మెడగాస్కర్, ఏఎస్ రాజా కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, శివాజీపాలెం జీవీఎంసీ స్కూల్ హెచ్‌ఎం బీకేడీ కుమారి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు వన్యప్రాణి సంరక్షణపై ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు.

డంపింగ్‌యార్డ్ తరలించే వరకు పోరాటం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు రామచంద్రనగర్ సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేసే వరకూ పోరాటాలు చేస్తామని ఆ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ మేరకు రామచంద్రనగర్‌లోని సామాజిక భవనం వద్ద గురువారం సాయంత్రం 16 గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కమిటీని నియమించారు. జేఏసీ కమిటీ సలహాదారులుగా కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, నాయకులు రంభ నారాయణమూర్తి, మంత్రి శంకరనారాయణ, ముమ్మన మురళి, ఎం.రాంబాబు నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులను నియమించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు

ఏయూ సమాచారమ్

మహిళా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వర్సిటీ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్తంగా నిర్వహించనున్నట్టు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ప్రతి సంవత్సరం విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. తెలుగు విభాగాధిపతి అప్పారావు మాట్లాడుతూ వర్సిటీ అసెంబ్లీ హాల్‌లో నిర్వహించే ఈ వేడుకలో విశిష్ట మహిళలను సన్మానిస్తామన్నారు.



మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

దాతకు సత్కారం



దాత చెల్లారావును సత్కరిస్తున్న ఆలయ కమిటీ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస మరిడిమాంబ అమ్మవారి ఆలయంలో సొంత నిధులతో ఫ్లోరింగ్ పనులు చేపట్టిన దాత శీరందాసు చెల్లారావును ఆలయ కమిటీ సత్కరించింది. మరిడిమాంబ ఆలయంలో ఇప్పటికే ముఖ ద్వారాన్ని ఒక దాత నిర్మించగా, రూ. 35వేల నిధులతో చెల్లారావు గచ్చుకు టైల్స్ వేయించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పిళ్లా రవి ప్రసాద్, బలిరెడ్డి సత్యనారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కళలతో సమాజంలో గుర్తింపు

ఆరిలోవ: కళలు సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు తీసుకొస్తాయని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ అన్నారు. దీన్‌దయాళ్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహంలో నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు నవరస మూర్తి బాలురకు నెల రోజుల పాటు నటనలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన 'తప్పు తెలిసింది' నాటికను బులికృష్ణ ఆసక్తిగా తిలకించారు. అనంతరం నటనలో తర్ఫీదు పొందిన బాలురకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బులికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కళల్లో ప్రావీణ్యం పొందడం ఎంతైనా అవసరమన్నారు. నటనలో శిక్షణ పొందిన విద్యార్థులు మంచి సందేశాత్మకమైన నాటిక ప్రదర్శించారని అభినందించారు.



బాలురు ప్రదర్శించిన నాటికను తిలకిస్తున్న జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి బులికృష్ణ

ఆదాయపు పన్నుపై అవగాహన అవసరం

మద్దిలపాలెం: ఆదాయపు పన్ను విధానంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఆదాయ పన్నుల శాఖ బాలకృష్ణ అన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో గురువారం మద్దిలపాలెం కాకతీయ కన్వెన్షన్ హాల్‌లో స్వచ్ఛంద సంస్థలు, దేవదాయ శాఖాధికారులు, విద్యార్థులతో అవగాహన, అవుట్ రీచ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఆదాయ పన్నుల శాఖ కొన్ని వాటికి మినహాయింపు ఇచ్చిందన్నారు. నూతనంగా చట్టంలో వచ్చిన మార్పులను వివరించారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు, సీనియర్ చార్టెర్డ్ అకౌంటెంట్ యు.రామకృష్ణ ప్రసంగించారు. అనంతరం ఐటీ శాఖ అధికారులు నిర్వహించిన వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కం ట్యాక్స్ జాయింట్ కమిషనర్ వి.కోటేశ్వరమ్మ, రమణమూర్తి, ఏఎస్ఎం రెడ్డి పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఉన్నతాధికారులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికల్ వలవన్, ఏపీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.సృజన గురువారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. వీరి పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ చేశారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి వారి శేష వస్త్రాన్ని, ప్రసాదాన్ని ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దినేష్‌రాజ్ అందజేశారు.



ఆలయ బేడామండపంలో ప్రదక్షిణ చేస్తున్న కరికల్ వలవన్, సృజన

94.13 శాతం

రెండో రోజూ చురుగ్గా పింఛన్ల పంపిణీ



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్, నాయకులు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లో పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. 20 వార్డుల పరిధిలో సచివాలయాల వారీగా వలంటీర్లు 36 గంటల్లో 94.13 శాతం పింఛన్లను పంపిణీ చేశారని జీవీఎంసీ యూసీడీ విభాగం అధికారులు తెలిపారు. నగరంలోనే పెద్ద జోన్‌గా ఉన్న గాజువాకలో మొత్తం 31,281 మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, ఇతర పింఛనుదారులున్నారు. వారికి ప్రభుత్వం ప్రతి నెలా రూ.8,82,89,250లను మంజూరు చేస్తోంది. ఈ నెల ఒకటి, రెండు తేదీల్లో వలంటీర్లు 29,445 మందికి ఇంటింటికీ వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. కొంతమంది లబ్ధిదారులు ఇళ్ల వద్ద అందుబాటులో లేకపోవడంతో వారు ఎక్కడున్నదీ తెలుసుకుని, అక్కడికి వెళ్లి అందజేశారు. సచివాలయ సిబ్బందికి గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు కూడా సహకరించడంతో పింఛన్ల పంపిణీ మరింత వేగవంతమైంది. పింఛన్లను త్వరితగతిన పంపిణీ చేయడంపై సంబంధిత అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పెదపాలెంలో రోషన్‌బీబీకి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ అజారుద్దీన్

68వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెంలో రెండోరోజు పింఛన్ల పంపిణీ కొనసాగింది. మొదటి రోజు అందుకోలేని లబ్ధిదారులకు గురువారం పింఛన్లను అందజేశారు. వలంటీర్ టి.సత్య, కన్వీనర్ నేలపాటి సత్యవతి తదితరులు పింఛన్లు అందజేశారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పెదపాలేనికి చెందిన రోషన్ బీబీ అనే 90 ఏళ్ల వృద్ధురాలికి వలంటీర్ అజారుద్దీన్ పెన్షన్ అందజేశారు. మంచం మీద కదల్లేని పరిస్థితుల్లో ఉన్న ఆమె ఇంటికి వెళ్లి పింఛన్ అందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీతంరాజు సుధాకర్ గెలుపు అవసరాన్ని ప్రతి ఒక్కరికీ వివరించి ఓట్లను అభ్యర్థించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహ పాత్రుడు, భూపతిరాజు సుజాత, డీసీఎంఎస్ చైర్ పర్సన్ పల్లా చినతల్లి, నాయకులు మంత్రి రాజశేఖర్, సిరట్ల శ్రీనివాస్, కోమటి శ్రీనివాస్, వై.మస్తానప్ప, వెంపాడ అప్పారావు, బొడ్డ గోవింద్, జి.పూర్ణానందశర్మ, యువశ్రీ, మంజుల, సంపంగి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

బాల్య వివాహాలు నేరం

పెదగంట్యాడ: చిన్న వయసులోనే పిల్లలకు వివాహాలు చేయడం నేరమని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అన్నారు. 'బాల్యంలో పెళ్లిళ్లు – భావితరాలకు ఉరితాళ్లు' నినాదంతో వార్డు పరిధిలోని గిరిజా కాలనీ సామాజిక భవనంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బాలబాలికలకు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం వల్ల వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కో–ఆర్డినేటర్ నిఖిల, కమ్యూనిటీ మొబిలైజర్ ధనలక్ష్మి, వెల్ఫేర్ సెక్రటరీ ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకులు మంగు నాయుడు, దేముడు, పెంద్ర రాజు, ప్రవీణ్, జాన సతీష్, ఆర్మీ సతీష్, వలంటీర్ జగదీష్ పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు

749వ రోజుకు ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు గురువారానికి 749వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్–1 విభాగానికి చెందిన కార్మికులు కూర్చుని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు నేటికీ దీనస్థితిలో ఉన్నాయని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి, ప్రభుత్వరంగ సంస్థల జోలికి రాకుండా ఉంటే మంచిదని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమిస్తున్నట్లు రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రకటించాలని, లేదంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందు మూలముగ యావన్మందికీ తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు అయిన ఐ.డి.బి.ఐ బ్యాంక్ లిమిటెడ్, రిటైల్ అసెట్స్ సెంటర్, విశాఖపట్నం వారి నుండి ఈ క్రింద తెలియపరచిన షెడ్యూల్ దాఖలా ఆస్తిలో నిర్మించిన ఇంటిని తనఖా ఇచ్చి ఋణం పొందదలచిన ఇంటి స్థలం యజమాని శ్రీ సీలార్తి బాబూరావు గారు, సదరు షెడ్యూల్ దాఖలా ఆస్తికి సంబంధించిన లింక్ దస్తావేజు, అనగా ఇందుకూరి సూర్యనారాయణ రాజు గారిచే, దాలిబోయిన వెంకటరావు గారి పేరిట రిజిష్టర్ చేయబడిన "స్వాధీన క్రయపూర్వకముతో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ" నెం. 1269/1999 తేది. 16-06-1999ది, కనబడుట లేదనియు వెదికినా దొరకలేదనియు తెలియపరిచినారు.

కావునా సదరు తనఖా చేయదలిచిన ఆస్తి విషయమై ఎవరికైనా ఎటువంటి క్లైములు, తనఖాలు, కోర్టు తగాదాలు ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన తేది నుండి "7 దినములు" లోగా ఈ క్రింది తెలిపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియపరచవలెను. లేనియెడల తదుపరి జరుగు ఎట్టి పరిణామాలకు మా క్లయింట్లు బాధ్యులు గారని తెలియపరచడమైనది.

షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా, పెదగంట్యాడ సబ్‌రి, గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ పరిధి, గాజువాక మండలం, చినగంట్యాడ గ్రామం సర్వే నెం. 86/14లో చేరినటువంటి డోర్ నెంబర్ 6-65-8 కలిగిన గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోరుగల ఇంటి విస్తీర్ణం 218 చ॥గ॥లు ఆస్తికి హద్దులు : **తూర్పు**: సిరసపల్లి అప్పన్న గారి ఆస్తి, **దక్షిణం**: ఇతరుల ఆస్తి, **పడమర**: జి.సత్యనారాయణ గారి ఇల్లు, **ఉత్తరం**: మున్సిపల్ సి.సి.రోడ్డు.

ఎం రామకృష్ణరాజు, మోతి లక్ష్మి సాహు
న్యాయవాదులు
డోర్ నెం. 43-18-4, వెంకటరాజు నగర్, టి.ఎస్.ఎన్.కోలనీ, విశాఖపట్నం – 530016.
ఫోన్ : 0891-2503514, 9441046814